## 6న మొక్కలు నాటే కార్యక్రమం...హాజరుకానున్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** సేవా సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఈనెల 6న బూర్గుపల్లి నుంచి రామాయంపేట వరకు నిర్వహించనున్న మొక్కలు నాటే కార్యక్రమాన్ని గవర్నర్ శివప్రతాప్ శుక్లా హాజరవుతున్నట్లు బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌ముదిరాజ్ తెలిపారు. మెదక్ ఎంపి రఘునందన్‌రావు సూచనమేరకు శనివారం కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. మొక్కలు నాటడడం ఎంతో ముఖ్యమో నాటిన మొక్కలను సంరక్షించడం అంతే ముఖ్యమన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాగా ఈనెల 4న తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని బ్రాహ్మణపల్లి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పర్యటించనున్నారని తెలిపారు. ఎంపి రఘునందన్‌రావు అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు.కార్యక్రమంలో ఎంపి పిఆర్‌ఓ వంశీ, రామాయంపేట కౌన్సిలర్ శంకర్,పుల్లూరు రాజు, శ్రీనివాస్‌గౌడ్,అమర్ తదితరులు పాల్గొన్నారు.




## అందోలులో కాంగ్రెస్ నూతన అధ్యక్షుల నియామకం

**జోగిపేట, అక్టోబరు 3, ప్రభాతవార్త:**

అందోలు నియోజకవర్గంలోని మండలాలకు కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులను నియమిస్తూ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేశారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచనల మేరకు రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ అందోలు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు, జోగిపేట పట్టణ ానికి పార్టీ నూతన అధ్యక్షులను నియమించారు. జోగిపేట పట్టణ అధ్యక్షు లుగా డాకూరి గాలయ్యగారి వెంకటేశం, అందోలు మండల అధ్యక్షులుగా గంగాధర్ అశోక్, మునిపల్లి మండల అధ్యక్షులుగా లింగన్నగారి సతీష్ కుమార్, చౌటకూరు మండల అధ్యక్షులుగా శ్రీ బొడపట్ల గణేష్, పుల్కల్ మండల అధ్యక్షులుగా శ్రీ మల్లన్నగారి దుర్గారెడ్డి, రాయికోడ్ మండల పార్టీ అధ్యక్షులుగా పట్లోల్ల కేదార్‌నాథ్, వట్పల్లి మండల అధ్యక్షులుగా వజినాల విశ్వాస్, రేగోడు మండల అధ్యక్షులుగా దిగంబర్‌రావు, అల్లాదుర్గం మండల అధ్యక్షులుగా కొప్పుల శేషారెడ్డి, టేక్మాల్ మండల అధ్యక్షులుగా పట్లోల్ల విష్ణువర్దన్‌రెడ్డిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నేతలు

## సమస్యలను పరిష్కరించాలి

**కొండపాక, అక్టోబరు 3, ప్రభాతవార్త :** మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంచాల కనక రాములు ఆధ్వర్యంలో శనివారం సచివాలయంలో వివిధ గ్రామాల నాయకులతో కలిసి వినతిపత్రం అందించారు. స్పందించిన మంత్రి వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమాచారం అందించి సమస్యలను తొందరగా పరిష్కరించాలని సూచించినట్లు ఆయన తెలిపారు.కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ వర్దరాములు, సర్పంచుల ఫోరమ్ వెంకటేశం, మల్లయ్య, కర్నాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ బైరి ప్రవీణ్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్, నాయకులు శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తోటకూర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అమిత్‌షా పర్యటన రద్దు...

### హాజరుకానున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**తూప్రాన్, అక్టోబరు 3 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి సమీపంలో నేడు అమూల్ మిల్క్ డైరీ ప్రతిష్ఠాపన భూమి పూజ కార్యక్రమానికి హాజరుకావాల్సిన కేంద్ర మంత్రి అమిత్ షా చివరి నిమిషంలో రద్దయింది. అన్ని శాఖల అధికారులు పరిశ్రమ యజమానులు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసినప్పటికీ అనివార్య కారణాల వల్ల కార్యక్రమం రద్దయింది. యధావిధిగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తోపాటు మంత్రులు వివేక్ వెంకటస్వామి, దామోదర్ రాజనర్సింహ, ఎంపీ రఘునందన్ రావు, చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమం జరగనుంది. అందుకు అమూల్ మిల్క్ కంపెనీ యజమానియం ఏర్పాట్లు నిమగ్నమయ్యారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 3, ప్రభాతవార్త :** ఎస్‌జిఎఫ్ క్రీడల్లో జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి వివిధ క్రీడల్లో రాష్ట్రస్థాయి పోటీలకు 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఫుట్‌బాల్ అండర్-17 విభాగంలో వర్షిత్, అండర్-14 విభాగంలో ఆర్యాన్, హ్యాండ్ బాల్‌లో అండర్-17 బాలికల విభాగంలో అర్చన, అండర్-14 బాలికల విభాగంలో హర్షప్రియ, నక్షత్ర, బాలుర విభాగంలో శరత్, క్రికెట్‌లో ఎం.అఖిలాష్, ఆర్.రిషికొర్తన్, డి.నవ్య, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం, పిడి. సంతోష్ విద్యార్థులను అభినందించారు.

## ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు

### రీ ప్యాకింగ్ చేస్తున్న దుకాణం లైసెన్స్ రద్దు



తనిఖీలు చేస్తున్నప్పుడుఫుడ్ సేఫ్టీ అధికారులు

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబరు 3, ప్రభాతవార్త :** పట్టణంలోని నాల్సాబ్ గడ్డ కాలనీలో ఉన్న ఎం/ఎస్ గ్లోబల్ ట్రేడర్స్ సంస్థను శనివారం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృత శ్రీ, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాజేశ్వర్ తనిఖీ చేశారు. తనిఖీలో ఎఫ్‌బిఓ సోయాబీన్ ఆయిల్‌ను హెల్త్ ప్లస్ రిఫఇనెడ్ సన్ఫ్లవర్ ఆయిల్ పేరుతో రీప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. రీప్యాకింగ్ చేస్తున్న ఎడిబుల్ ఆయిల్ నాణ్యతను పరీక్షించేందుకు అవసరమైన ఇన్‌హౌస్ ల్యాబొరేటరీ సదుపాయం సంస్థలో అందుబాటులో లేదన్నారు రీప్యాక్ చేసిన ఆయిల్‌కు సంబంధించి అవసరమైన రికాల్ మెకానిజం (ఉత్పత్తిని వెనక్కి తీసుకునే విధానం) సంస్థలో అందుబాటులో లేదనిపై ఉల్లంఘనలతోపాటు ఎడిబుల్ ఆయిల్‌కు సంబంధించి కల్తీ/తప్పుడు బ్రాండింగ్‌కు సంబంధించిన అనుమానాలు ఉన్న నేపథ్యంలో, సదరు ఎఫ్‌బిఓ ఫస్సై లైసెన్స్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేసి, ఆయిల్ రీప్యాకింగ్ కార్యకలాపాలను నిలిపి వేసినట్లు అధికారులు తెలిపారు అదనంగా, వివిధ రకాల 3 ఎడిబుల్ ఆయిల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాంపిల్లను సేకరించి, ప్రయోగశాల పరీక్షల నిమిత్తం ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించా మన్నారు.ప్రయోగశాల పరీక్షల నివేదికలు అందిన అనంతరం, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ 2006 కింద రూపొందించిన నిబంధనలు/రెగ్యులేషన్ల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృత శ్రీ, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాజేశ్వర్ లు తెలిపారు.

## ప్రజావసరాలకు ప్రభుత్వ భూమిని వాడుకుంటాం

### అనుమతి ఇవ్వాలి : సర్పంచ్

**కొండపాక, అక్టోబరు 3, ప్రభాతవార్త :** ప్రభుత్వ భూమిని గ్రామస్తుల అవసరాల కోసం వాడుకొనుటకు అనుమతి ఇవ్వాలని కోరుతూ శనివారం డిప్యూటీ తహసీల్దార్‌కు సర్పంచ్ మంచాల నవీనతోపాటు పాలక వర్గం సభ్యులు, గ్రామస్తులు పంచాయతి తీర్మానం కాపీని అందించారు. కొండపాకలోని సర్వే నంబర్ 731,733లలోఉన్న 2.18 ఎకరాల భూమిని చదును చేసి గ్రామస్తుల అవసరాల కోసం వాడుకోవాడానికి రెవెన్యూ అధికారులు సహకరించాలని గ్రామ పంచాయతి పాలకవర్గం తీర్మానంచేసి తహసీల్దార్ కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంచాల నవీన మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో పూర్తిగా చెట్లు పొదాలతో నిండిపోయి ఉండడంవల్ల అటువైపు ఉన్న రైతులు వారి వ్యవసాయ పోలాల వద్దకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని వెంటనే అధికారులు చెట్ల పొదలను తొలగించి శుభ్రం చేయుటానికి పంచాయతి పాలవవర్గం తరపున గ్రామస్తుల అవసరాల కోసం తీర్మానం చేశామని తెలిపారు. భూమిలో పొదలను తొలగించి, శుభ్రం చేయటానికి పంచాయతి అధికారులకు అనుమతిని ఇవ్వాలని కోరారు. భూమిలో రాబోవు బతుకమ్మ పండుగకు మహిళలు బతుకమ్మ అడుకోవడానికి, తర్వాత వరి కోతల సమయంలో వడ్లు అరబోసుకొని అమ్ముకోవడానికి వాడుకొనున్నట్లు అమె తెలిపారు.

# రెసిడెన్షియల్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై శ్రద్ధ

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, అక్టోబరు 3 ప్రభాతవార్త :** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వసతి, పరిశుభ్రమైన వాతావరణం, పౌష్టికాహారం, సురక్షితమైన తాగునీరు, అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు, మరమ్మతుల అవసరాలు, విద్యార్థుల భద్రత తదితర అంశాలపై సంబంధిత అధికారులు, జిల్లా కోఆర్డినేటర్లు, ప్రిన్సిపాళ్లతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, ఆహారం తయారీ, నిల్వ, పంపిణీలో పరిశుభ్రత ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. అలాగే వసతి గృహాల్లో తగిన గాలి, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రతి గదిలో అవసరమైన ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు, తాగునీటి సదుపాయాలు సక్రమంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా బాలికల వసతి గృహాల్లో మరుగుదొడ్లు, స్నానపు గదులు, తలుపులు, రన్నింగ్ వాటర్ తదితర సదుపాయాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమయ్యే పనులకు సంబంధించి పూర్తి వివరాలతో అంచనా ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని ప్రిన్సిపాళ్లు, జిల్లా కోఆర్డినేటర్లను ఆదేశించారు. విద్యార్థులు రాత్రి వేళల్లో సురక్షితంగా తిరిగిలే ంసిడెన్షియల్ పాఠశాలల క్యాంపస్ పరిసరాల్లో తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులు సౌకర్యవంతంగా చదువుకునేలా, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అఖిలేష్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల జిల్లా కోఆర్డినేటర్లు, ప్రిన్సిపాళ్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోతో తాగునీటి ఎద్దడిని ఎదుర్కోనేందుకు సిద్ధం కావాలి

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి




సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు, అక్టోబరు 3, ప్రభాతవార్త :**

ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా పూర్తిస్థాయి ప్రణాళికలతో సంబంధిత అధికారులు సిద్ధం కావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సూచించారు. శనివారం క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్లు, జలమండలి, మిషన్ భగీరథ, విద్యుత్, గృహ నిర్మాణ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు మున్సిపాలిటీల పరిధిలో రూ. 75 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షి ంచారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు. రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా కౌన్సిల్ ఆమోదంతో బోర్లువేయాలని సూచించారు. ప్రజలు ఎంతో నమ్మకంతో ప్రజాప్రతినిధులుగా ఎన్నుకుంటారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయడమే ప్రజాప్రతినిధుల ప్రథమ కర్తవ్యమని గడ్డపోతారం మున్సిపల్ కౌన్సిలర్లకు ఎమ్మెల్యే జీఎంఆర్ సూచించారు. అభివృద్ధిని అడ్డుకుంటే సహించేదిలేద్నారు.పాలకమండలి సభ్యులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు.జలమండలి, మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జానకంపేట, గండిగూడెం, దాయర, బొమ్మనకుంట పరిధిలో రెండు సంవత్సరాలుగా తాగునీటి పంపిణీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, 10 లక్షల రూపాయలతో నూతన పైపుల నిర్మాణం చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెట్టబోతున్నట్లు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.ముత్తంగి డివిజన్ పరిధిలోని పోచారం, ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని లకడారంపరిధిలో నిర్మాణం పూర్తయిన సబ్‌స్టేషన్లను అక్టోబర్ రెండో వారంలో ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. మాదారం, ఘనాపూర్, కొల్లూరు, నాగులపల్లి పరిధిలో నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలాలు కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఇందిరమ్మ ఇల్లు, రెండు పడక గదుల ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని గృహ నిర్మాణ శాఖ పిడి చలపతిరావు ను ఎమ్మెల్యే జీఎంఆర్ కోరారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు అందించేలా తాము కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ అంశంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయ జోక్యానికి తావులేదని తెలిపారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ఘనంగా ఆరుద్రాష్టమి వ్రతం

### 2700 మంది మహిళలతో సామూహిక వ్రతం



సామూహిక వ్రతంలో పాల్గొన్న మహిళలు

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబరు 3, ప్రభాతవార్త :** సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని శ్రీజ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో పీఠాధిపతి మహేశ్వరశర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో ఆరుద్రాష్టమి వ్రత క్రతువు కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మల, జగ్గారెడ్డి పాల్గొన్నారు.అరుద్రాష్టమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. 2700 మంది మహిళలతో సామూహిక ఆరుద్రాష్టమి వ్రతాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆరుద్రాష్టమి మహత్యం, అమ్మవారి విశిష్టత, పూజా విధానాలను నిర్వాహకులు భక్తులకు వివరించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ప్రత్యేక పూజలతో ఫసల్‌వాది జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ కార్యక్రమం లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంగేరి శ్రీహరి, జ్యోతిర్వాస్తు విద్యాపీఠం నిర్వాహకులు పాల్గొన్నారు

# టేక్మాల్‌లో 'కల్లు' సొసైటీలో గందరగోళం..!

### ఇష్టానుసారంగా దుకాణాల ఏర్పాటు పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



టేక్మాల్‌లో అక్రమంగా వెలిసిన కల్లు దుకాణం

**టేక్మాల్, అక్టోబరు 3: ప్రభాతవార్త:** మండల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న అనధికారిక కల్లు వ్యాపార దందాలు స్థానికంగా తీవ్ర కలకలం రేపుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక వ్యాపారానికి కేటాయించిన ఒకే అనుమతి పత్రం(లైసెన్స్)పై వేర్వేరు ప్రాంతాల్లో సమాంతరంగా వేర్వేరు దుకాణాలు నిర్వహించడానికి ఎలాంటి వెసులుబాటులేదు. కాగా టేక్మాల్ కల్లు సొసైటీలో సభ్యుల మధ్య ఏర్పడిన గందరగోళాన్ని ఆసరాగా చేసుకుని కొందరు అడ్డదారి తొక్కుతున్నారు. ఒకే లైసెన్స్‌ను అడ్డంపెట్టుకుని ఏకంగా రెండు వేర్వేరు దుకాణాలను దర్జాగా నడిపిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రం తోపాటు ఎల్లంపల్లి, సర్మాన్‌కుంట, సాలూజిపల్లి, గొల్లగూడెం తదితర గ్రామాల్లో ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే కల్లు దుకాణాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల అలసత్వమే కారణమా? ఇలాంటి అక్రమ కార్యకలాపాలు బహిరంగంగా జరుగుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన ఎక్సైజ్ అధికారులు మాత్రం ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు, మేధావులు మండిపడుతున్నారు. టేక్మాల్ సొసైటీలో సభ్యుల మధ్య ఏర్పడ్డ వివాదంతో ఒకే లైసెన్స్‌పై పలు దుకాణాలు వెలిశాయని తెలుస్తోంది.ఈ విషయం పై సొసైటీ ఎక్సైజ్ శాఖ దృష్టికి తీసుకెళ్లడంతో, లైసెన్సులులేని దుకాణదారులను ఒకచోటకు పిలిపించి మందలించినట్లు విశ్వసనీయ సమాచారం. అయినప్పటికీ 'తగ్గేదేలే' అంటూ రెండు మూడు దుకాణాలను కొనసాగిస్తుండటం గమనార్హం. తనిఖీలు చేపట్టాల్సిన అధికారులు మౌనం వహించడం వెనుక అసలు ఆంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల అలసత్వమే నిబంధనలు ఉల్లంఘించేవారికి మరింత ధైర్యం కల్పిస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా జిల్లా, మండల స్థాయి ఉన్నతాధికారులు స్పందించి, టేక్మాల్ మండలంలో ఒకే లైసెన్స్‌తో నడుస్తున్న కల్లు దుకాణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్వహిస్తున్న దుకాణాలను గుర్తించి, బాధ్యులైన వారిపై.. వారికి కొమ్ముకాస్తున్న అధికారులపైనా తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**అక్రమ దుకాణాలపై చర్యలు తీసుకుంటాం**

ఈ విషయమై మెదక్ ఎక్సైజ్ సీఐ వెంకటేశంను వివరణ కోరగా అక్రమ దుకాణాలున్నట్లు తమ దృష్టికి వస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని, ఇప్పటివరకు తన దృష్టికి రాలేదని తెలిపారు. లైసెన్సులు లేని దుకాణాలపై కేసులతో కూడిన కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే లైసెన్సులు ఉన్న దుకాణాలను నడపాలని, త్వరలో ఈ పై విషయంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.



రామాయంపేట-మెదక్ రహదారిపై బైఠాయించిన రైతులు

# 12 గంటల కరెంట్ హామీ ఎక్కడ....?

### సబ్‌స్టేషన్ ముట్టడి.. రాస్తారోకోకు దిగిన రైతన్నలు

**రామాయంపేట, అక్టోబరు 3, ప్రభాతవార్త :** ప్రభుత్వం హామీ ఇచ్చిన 12 గంటల ఉచిత విద్యుత్ హామీ ఏమైంది...? పొలాలకు నీరెలా పెట్టాలి...? పంటలను ఎలా కాపాడుకోవాలి....? అంటూ రామాయంపేటలో అన్నదాతలు ఆగ్రహంతో రోడ్డెక్కారు. వ్యవసాయానికి నాలుగు గంటలు సక్రమంగా విద్యుత్ అందడం లేదని ఆరోపిస్తూ శనివారం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో అక్కడి నుంచి రామాయంపేట-మెదక్ ప్రధాన రహదారిపైకి చేరుకుని రాస్తారోకో చేపట్టారు. దీంతో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా సక్రమంగా చేయాలని, పంటలను ఎండబెటకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. పంటలు కీలక దశలో ఉన్న సమయంలో కరెంట్ సరఫరా లేకపోవడంతో బోర్లు, మోటార్లు నడపలేక పొలాలకు నీరందించలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు పెట్టుబడులు పెరిగిపోతుంటే, మరోవైపు పంటలకు నీరు పెట్టేందుకు కరెంట్ దొరకడం లేదని కన్నీటి పర్యంతమయ్యారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియక పొలాల వద్దే పడిగాపులు కాయాల్సి వస్తోందని, రాత్రి వేళల్లో సరఫరా చేయడంతో ప్రాణాలను పణంగా పెట్టి పొలాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తూ, సరఫరా వేళలను స్పష్టంగా ప్రకటించి, నిర్ణీత సమయం మేరకు నిరంతరాయంగా విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. పంట చేతికొచ్చేవరకు విద్యుత్ సమస్య లేకుండా చూడాలని, లేకుంటే రైతుల ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్

## జిల్లా ప్రధాన కార్యదర్శిగా కిరణ్‌కాంత్




నియామకపత్రం అందుకుంటున్న అంగడి కిరణ్‌కాంత్

**మర్కుక్, అక్టోబరు 3, ప్రభాతవార్త :** మర్కుక్ మండలం దామరకుంట గ్రామానికి చెందిన అంగడి కిరణ్‌కాంత్‌ను ఇటీవల అల్వాల్‌లోని పల్లవి మోడల్ స్కూల్‌లో జరిగిన తెలంగాణ రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అంగడి కిరణ్‌కాంత్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఇంత పెద్ద బాధ్యతను అప్పగించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేష్ మైనాల, ప్రధాన కార్యదర్శి మామిడి శ్రీధర్, కోశాధికారి దాడి శ్రీనివాస్‌తో పాటు పలు జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రమాద బాధితులను పరామర్శించిన మంత్రి

**పటాన్‌చెరు, అక్టోబరు 3, ప్రభాతవార్త :**

వికారాబాద్ జిల్లా అనంతగిరి ఘాట్ రోడ్డులో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో గాయపడిన వారిని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ఆసుపత్రిలో పరామర్శించారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిలో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామానికి చెందిన వారు ఉన్నారని తెలుసుకుని శ్రీనివాస్ గౌడ్ వారిని పరామర్శించి క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు భరోసా ఇచ్చారు.



గాయపడిన వారిని పరామర్శిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 15 మందికి జైలుశిక్ష

### -రూ.1.5 లక్షల జరిమానా

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 3, ప్రభాతవార్త :** డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన 24 మంది వాహనదారులను శనివారం గజ్వేల్ కోర్టులో హాజరు పరిచినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. విచారణ చేసిన జడ్జి 15 మందికి జైలు శిక్ష విధించగా, మరో 9 మందికి రూ.90వేల జరిమానా విధించినట్లు తెలిపారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ముగ్గురికి రూ.5వేల చొప్పున రూ.15వేల జరిమానా విధించడం జరిగిందన్నారు.

## ఇంటి దృవపత్రాలు పోయాయి..

**సిర్గాపూర్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** మండల పరిధిలోని జమ్లా తండాకు చెందిన విస్లావత్ రవీందర్ నాయక్ ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ ఇంటి దృవపత్రం(యుఐడి 992904048656)ను పోగొట్టుకున్నాడు. బాధితుడు రవీందర్‌నాయక్ కథనం ప్రకారం... జమ్లాతాండ నుంచి తనకు చెందిన ద్విచక్ర వాహనంపై నారాయణఖేడ్ వెళుతున్న క్రమంలో దారిలో ఎక్కడో పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి దృవ పత్రం ఎవరికైనా దొరికితే తమకు సమీపంలోఉన్న పోలీసు ఠాణాలో అప్పగించాలని రవీందర్‌నాయక్ వినతి చేశారు.

